ఏటిగట్టు పూర్తయ్యేదెప్పుడు?

- దీవిలో ఏటిగట్టు పదిలమేనా?
- భారీగా పెరిగిన అంచనా
- నిధుల విడుదలపై అనుమానం



దిండి- శివకోడు సరిహద్దులో అసంపూర్తిగా ఏటిగట్టు పనులు

మలికిపురం: ప్రస్తుతం వరదల సమయం ఆసన్నమైంది. మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల్లో వర్షాలు భారీగా కురుస్తుంటే గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఆగస్టు వచ్చిందంటే ముంపు ప్రాంతాల ప్రజలకు మరీ భయం. రాజోలు దీవిలో ఏటిగట్టు పనులపై నీలి మేఘాలు కమ్ముకున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాజోలు దీవి ఏటిగట్టు వెడల్పు పనులకు సుమారు రూ.50 కోట్లు మంజూరయ్యాయి. 47వ కిలోమీటరు నుంచి 70వ కిలోమీటరు వరకు ఒక ప్యాకేజీ, 70 నుంచి 90వ కిలోమీటరు వరకు మరో ప్యాకేజీ కింద పనులు కేటాయించారు. ఆయన హయాంలో 50 శాతం పనులు పూర్తయ్యాయి. వైఎస్ మరణం అనంతరం పనులు స్తంభించాయి.

నిలిచిపోయిన పనులు

దిండికి ఎగువన 47వ కిలోమీటరు నుంచి 70వ కిలోమీటరు వరకు సుమారు 23 కిలోమీటర్లకు కేవలం సుమారు 3కిలోమీటర్లు మాత్రమే పనులు పెండింగ్‌లో ఉండగా దిండికి దిగువన 70 నుంచి 90వ కిలోమీటరు వరకు అనగా అంతర్వేది, పల్లిపాలెం వరకు సుమారు 20 కిలోమీటర్లకు గానూ 5 కిలోమీటర్లు కూడా పూర్తి కాలేదు. అది కూడా అసంపూర్తిగానే సాగాయి. పనులు నిలిచిపోవడానికి ప్రధాన కారణం ఏటిగట్టుపై విద్యుత్ స్తంభాలు, ఇళ్లను తొలగించడంలో తీవ్ర జాప్యం జరిగింది. నేటికీ ఏటిగట్లపై విద్యుత్ స్తంభాలు, ఇళ్లను తొలగించలేక అధికారులు సైతం చేతులెత్తేయడంతో పనులు స్తంభించాయి. పలుమార్లు ఆర్డీఓ పర్యటించి పరిహారం ఇచ్చేందుకు ముందుకు వచ్చినా పరిహారం అందక పనులకు అవరోధంగా మారింది. ఈ లోపు కాంట్రాక్టరు గడువు ముగియడంతోపాటు, నిధుల విడుదలలో తీవ్ర జాప్యం, ఇళ్ల తొలగింపులో అలసత్వం తదితర లోపాల కారణంగా రాజోలు దీవిలో సుమారు 20 కిలోమీటర్ల ఏటిగట్టు పనులు నిలిచిపోయాయి.

పనులు పూర్తి కావాలంటే

ఏటిగట్టు వెడల్పు చేయడంతో పాటు, గ్రావెల్, మెటల్ వేసి అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రస్తుతం 20 కిలోమీటర్ల గట్టు పనులకు గాను 2008లో ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించింది. అవే పనులు పూర్తి కావాలంటే ప్రస్తుతం రూ.90 కోట్లు అవుతుందని అంచనా. దిండికి దిగువన పనులు కొత్తగా ప్రారంభించేందుకు పదేళ్ల క్రితం రూ.30 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. అనంతరం ప్రభుత్వాలు మారడంతో అది కూడా మరుగున పడింది. చేసిన పనులకు కూడా ప్రభుత్వం బిల్లులు చెల్లించక కాలయాపన చేస్తున్నట్లు సమాచారం. ఇక ఏటిగట్ల పెండింగ్ పనులకు ఏనాటికి నిధులు మంజూరవుతాయో, ఎప్పటికి పనులు పూర్తవుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఏటి గట్లు పటిష్ట పరచాలి



రాజోలు దీవిలో ఏటి గట్లు బలహీనంగా ఉన్నాయి. ఆగస్టు నెలలో వరదలు వచ్చే అవకాశం ఉంది. గట్టుకు గండి పడితే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

– గొల్లపల్లి సూర్యారావు, మాజీ మంత్రి.

ఏటిగట్లపై శ్రద్ధ వహిస్తాం



ఏటిగట్ల స్థితిగతులపై దృష్టి పెట్టాం. అసంపూర్తిగా పనులు జరిగిన అంశంపై కూడా అవగాహన ఉంది. బలహీనంగా ఉన్న చోట్ల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. దీనిపై ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తున్నాం.

– దేవ వర ప్రసాద్, రాజోలు ఎమ్మెల్యే.

ఏటిగట్లతో ముడిపడిన రవాణా

ఏటిగట్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ఫ్లడ్ బ్యాంకు రక్షణతోపాటు వాటిని రహదారులుగా వినియోగించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రణాళిక. గత 15 ఏళ్లుగా పనులు మందగించాయి. ఫలితంగా ఏటిగట్టు పరివాహక గ్రామాలతో పాటు రవాణా సౌకర్యం లేని గ్రామాలకు కూడా ఆ ప్రయోజనం ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై చర్యలు



మాచవరంలో షాపు యజమానికి నోటీసులిస్తున్న అధికారులు

అంబాజీపేట: పర్యావరణానికి హానీ కలిగించే ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తే శాఖా పరమైన చర్యలతో పాటు అపరాధ రుసుం విధిస్తామని డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్ అన్నారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాచవరంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి షాపు యజమానులకు ప్లాస్టిక్ వస్తువులపై అవగాహన కల్పించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని ఆగస్టు 15లోగా నిలుపుదల చేయాలని, విక్రయించే వారిపై రూ.500, రూ.1000 జరిమానా విధించనున్నామన్నారు. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగిస్తున్నారని భావించి ఆ దుకాణాలను సీజ్ చేయడంతోపాటు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసు ద్వారా తెలిపారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగించకుండా క్లాత్, జ్యూట్ సంచులను మాత్రమే వినియోగించాలన్నారు. షాపుల వద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయని వారిపై రూ.200లు జరిమానా విధిస్తామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తక్షణమే తగ్గించాలన్నారు. అంబాజీపేట సెంటర్‌లో 230 షాపుల వరకు నోటీసులు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఎఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మోసాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు

నియోజకవర్గ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు



పాశర్లపూడిలో ప్రజలకు కూటమి మోసాలు వివరిస్తున్న శ్రీనివాస్

మామిడికుదురు: మోసాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం బుధవారం అప్పనపల్లి, పాశర్లపూడి గ్రామాల్లో జరిగింది. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పరిశీలకులు నీతిపూడి గణేష్‌బాబు, తోరం సూర్యభాస్కర్, మొల్లేటి త్రిమూర్తులు పర్యవేక్షణలో రచ్చబండ కార్యక్రమాలు జరిగాయి. పలువురి ఇళ్లకు వెళ్లి వాలంటీర్ వ్యవస్థ రద్దు, రేషన్ వాహనాల తొలగింపుతో ప్రజలు ఏవిధంగా ఇబ్బందులు పడుతున్నారో తెలుసుకున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ హామీలు ఇవ్వడం, వాటిని ఎగ్గొట్టడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. వాటిని ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి వారిని వేధించడం తప్ప కూటమి ప్రభుత్వం ఇంతవరకు సాధించింది శూన్యమన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు ఇప్పటికే గమనించారని, ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ఎదురుచూస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ అమలు కోసం ప్రజల పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ నేతలు మందపాటి కిరణ్‌కుమార్, నెల్లి దుర్గాప్రసాద్, బత్తుల జనార్ధనరావు, బొంతు నీలిమ, పిచ్చుక చిన్న, జక్కంపూడి వాసు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై ర్యాలీ



ర్యాలీ చేస్తున్న పీడీ శ్యామల, అధికారులు, సేవా సంస్థ సభ్యులు

కొత్తపేట: వ్యవస్థీకృత నేరాల కారణంగా మానవ అక్రమ రవాణా ప్రపంచ వ్యాప్తంగా ముప్పుగా కొనసాగుతుందని ఐసీడీఎస్ పీడీ శ్యామల అన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ఆత్రేయపురం మండలం ర్యాలిలో వివిధ ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. వేజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమానికి సేవా సంస్థ డైరెక్టర్ పోతుమూడి శేషారత్నం అధ్యక్షత వహించగా పీడీ శ్యామల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఎక్కువ మంది బాధితులు హింసతో ఎక్కువ లాభం కోసం అక్రమ రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. 2020 నుంచి 2023 వరకు ప్రపంచవ్యాప్తంగా 2లక్షల కంటే ఎక్కువ మంది బాధితులు గుర్తించబడ్డారన్నారు. నివేదించబడని కేసుల సంఖ్య గణనీయంగా ఉంటుందని తెలిపారు. ఎంపీడీవో బీకేఎస్ఎస్‌వీ రామన్, ఎస్సై రాము మాట్లాడుతూ, కుటుంబం నుంచి మంచి అలవాట్లు, నడివడిక కలిగిఉంటే సమాజం మంచిగా ఉంటుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యుడు పీవీ ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం సూరిబాబు, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యపై దృష్టి సారించాలి



హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేసిన నాగభూషణరావు, హెచ్‌ఎం

అంబాజీపేట: సాంకేతిక విద్యను ప్రతి విద్యార్థి నేర్చుకొని ఉన్నత శిఖరాలను అవరోధించాలని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ కామిశెట్టి సత్యనాగభూషణరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో 6 నుంచి ఇంటర్ వరకు పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దాతలు అందించిన సాయాన్ని హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన బుధవారం పంపిణీ చేశారు. సత్యనాగభూషణరావు తల్లిదండ్రుల ట్రస్టు పేరున 6 నుంచి ఇంటర్ వరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు, పెన్నులు, పోల్డర్లను అందజేశారన్నారు. సత్యనాగభూషణరావు ఆధ్వర్యంలో ట్రస్ట్ ద్వారా గత 26 ఏళ్లగా విద్యార్థులకు నగదు ప్రోత్సహ బహుమతులను పంపిణీ చేస్తున్నారన్నారని హెచ్‌ఎం వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సత్యనాగభూషణరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎరువులు అధికంగా వాడొద్దు



పినపళ్లలో పొలంబడి నిర్వహిస్తున్న మీనా

అలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.మీనా అన్నారు. మండలంలోని పినపళ్ల, సంధిపూడి గ్రామాల్లో బుధవారం పొలంబడి కార్యక్రమం జరిగింది. ఏఓ మీనా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు సంగిత సుభాష్, తోట భవానీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవన ఎరువులు, వర్మి కంపోస్టు, వేపనూనె, సేంద్రీయ ఎరువులు, జింక్‌ను పొలాలకు వాడటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ మీనా రైతులకు తెలిపారు. అలాగే మట్టి విశ్లేషణ పరీక్షల ఆధారంగా ఎరువులు, పురుగు మందులను వినియోగించాలన్నారు. ప్రస్తుతం వరి దుబ్బు దశలో ఉన్నందున రైతులు అధికంగా ఎరువులు వినియోగించవద్దని కోరారు. అలాగే రైతులకు ఏవిధమైన సందేహాలున్నా సత్వరమే వ్యవసాయశాఖను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీలు పెద్దిరెడ్డి పట్టాభి, తోలేటి సంతోషి, గ్రామ వ్యవసాయ క్షేత్ర సహాయకులు పి.మధుసూధన్, ఉపసర్పంచ్ యనమదల రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రామాణిక ఆస్పత్రిగా గుర్తింపు లభిస్తుంది



డిప్యూటీ జనరల్ సూపరింటెండెంట్ కల్యాణి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో అధునాతన వైద్య సేవలు అందిస్తున్న స్థానిక స్త్రీల ఆసుపత్రి త్వరలో జాతీయ అక్రిడిటియేషన్ మెడికల్ బోర్డ్ మంజూరు చేసే ప్రామాణిక ఆసుపత్రిగా గుర్తింపు లభిస్తుందని తమిళనాడులోని వేలూరులో ఉన్న స్కాడర్ మెమోరియల్ ఆసుపత్రి డిప్యూటీ జనరల్ సూపరింటెండెంట్ కె.కల్యాణి తెలిపారు. రెండు రోజులుగా ఆమె స్థానిక స్త్రీల ఆసుపత్రిని పరిశీలించారు. జాతీయ అక్రిడిటియేషన్ నిబంధనలకు అనుగుణంగా స్థానిక స్త్రీల ఆసుపత్రికి గుర్తింపు పొందేందుకు 75 శాతం ప్రమాణాలున్నాయని, మిగిలిన 25 శాతం ప్రమాణాలను కల్పించేందుకు స్కాడర్ మెమోరియల్ ఆసుపత్రి కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే స్థానిక స్త్రీల ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో శిక్షణ పొందిన వైద్య సిబ్బంది ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీల ఆసుపత్రి సీఈఓ డాక్టర్ హెవార్డురాజ్ పాల్గొన్నారు.

దోమకాటుపై విద్యార్థులకు అవగాహన



గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న వేంకటేశ్వరరావు

పి.గన్నవరం: దోమల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి ఎస్.వేంకటేశ్వరరావు ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన నరేంద్రపురం గురుకుల పాఠశాలను సందర్శించారు. అక్కడ ఎనాఫిలస్, ఈడీస్ దోమలకు సంబంధించిన లార్వా ఉన్నట్టు గుర్తించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు జ్వరం ఉంటే వెంటనే చికిత్స అందించాలన్నారు. దోమ కాటు, పెను ప్రమాదం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకుముందు పి.గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మలేరియా, డెంగీ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు క్రమంగా జరపాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. కమ్యూనిటీ అధికారులు వై.ఆదినారాయణ, ఎన్‌వీ రామారావు, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన అధికారులు

రావులపాలెం: స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాలలో ఐదో తరగతి చదివి ఆరో తరగతికి నవోదయ అడ్మిషన్ సాధించిన అప్పారి జ్ఞాన ప్రదీప్‌ను బుధవారం మండల విద్యాశాఖ అధికారులు నాగ కుమార్, శ్రీనివాసరాజు అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు సమకూర్చిన రూ.2 వేల నగదు బహుమతిని అందజేసి తల్లిదండ్రులను సత్కరించినట్టు సీఆర్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

టీచర్లకు సన్మానం



గోగన్నమఠం హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు సన్మానం

మామిడికుదురు: గోగన్నమఠం జెడ్పీ హైస్కూల్లో పని చేసి పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులను స్థానికులు బుధవారం ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎంగా పని చేసి బదిలీ అయిన బావిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పి.వెంకాయమ్మ, రామాయణం చెల్లాయమ్మను ఘనంగా సన్మానించారు. విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందని ఎంఈఓ మోకా వెంకన్నబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ భూపతిరాజు లక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ చింతా శ్రీను, భూపతిరాజు సతీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణపై సమీక్ష

అలమూరు: మండలంలోని పెదపళ్లలో ఇటీవల జరిగిన వీధి కుక్కల దాడి సంఘటనలో గేదెదూడ మృతిచెందిన ఘటన తమ దృష్టికి వచ్చిందని ఆలమూరు ఏడీఏ ఎల్.అనిత అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రైతులతో సమీక్ష సమావేశం జరిగింది. సర్పంచ్ యేడిద సత్యశ్రీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏడీఏ పాల్గొన్నారు. అమలాపురంలో త్వరలోనే ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి వస్తుందన్నారు. వీధి కుక్కల నియంత్రణకు శస్త్రచికిత్సలు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వీధి కుక్కల దాడిలో గాయపడ్డ పశువులకు చికిత్సను అందించాలని పశుసంవర్ధక శాఖాధికారి భానుప్రకాష్‌ను ఆదేశించారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

సఖినేటిపల్లి: మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ బొలిశెట్టి ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ట్రీ కటింగ్, ఇతర పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అయినవిల్లి: మండలంలోని ఎస్ మూలపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని శానపల్లిలంక, తొత్తరమూడి గ్రామాల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు వంటి పనులు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

క్లుప్తంగా

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

అయినవిల్లి: విద్యార్థి దశ నుంచే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై హరికోటి శాస్త్రి అన్నారు. బుధవారం ముక్తేశ్వరంలోని కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాలలో ఆ పాఠశాల డైరెక్టర్ సీహెచ్ వీరవెంకట ప్రసాద్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్సై ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. 18 ఏళ్లు నిండితే గాని బైక్ నడపరాదన్నారు. తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేయకూడదన్నారు. సెల్‌ఫోన్లలోని రీల్స్‌కు బానిసలు కాకుడదన్నారు. మద్యంపానం, దూమపానం, మాదక ద్రవ్యాలు సేవించే వారికి దూరంగా ఉండలన్నారు. తెలియని నంబర్ల నుంచి ఫోన్లు వస్తే వాటిని ఎత్తకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ బీనాజాన్, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి కోతపై ధర్నా

మామిడికుదురు: గోదావరి కోతపై అప్పనపల్లి గ్రామస్తులు బుధవారం ధర్నా చేశారు. గోదావరి నదీ పాతం ఇళ్లను సమీపించిందని ఆందోళన వ్యక్తం చేశారు. సారవంతమైన భూములు నదీ గర్భంలో కలిసిపోతున్నాయని వాపోయారు. కోత నివారణ చర్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది గోదావరి వరదల సమయంలో వేలాది ఎకరాల భూములు నదీ గర్భంలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోత నివారణకు గ్రోయన్లు, రివిట్‌మెంట్ నిర్మించాలని నినాదాలు చేశారు. దశాబ్దాలుగా కోత సమస్య వేధిస్తున్నా ఎవరూ పట్టించుకోవట్లేదన్నారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా రమేష్‌బాబు



మామిడికుదురు: వైఎస్సార్ సీపీ మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కారుపర్తి రమేష్ బాబు నియమితులయ్యారు. దీనికి సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి ఆదేశాలు వచ్చాయని రమేష్‌బాబు బుధవారం తెలిపారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తనను విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమించారని చెప్పారు. పి.గన్నవరం నియోజకవర్గ ఇంచార్జి గన్నవరపు శ్రీనివాస్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్‌తోపాటు, తనను పదవిలో నియమించేందుకు సహకరించిన పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం

మామిడికుదురు: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ఎప్పుడూ తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని పాశర్లపూడి సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి తెలిపారు. పాశర్లపూడి–1, 2 సచివాలయాల్లో పని చేసి ఇటీవల బదిలీ అయిన పలువురు ఉద్యోగులను పంచాయతీ తరఫున బుధవారం సత్కరించారు. వారికి మెమొంటోలు అందించి శాలువాలతో సత్కరించారు. వారు చేసిన సేవలు ఉత్తమమైనవని పేర్కొన్నారు. ఉద్యోగులు మరింత కష్టపడి పనిచేసి మంచి పేరు పొందాలని అభిలాషించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.వాసు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కొత్తపేట: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి జిల్లా రవాణా అధికారి (డీటీఓ) దేవిశెట్టి శ్రీనివాసరావు నిత్యావసరాలు అందించారు. కొత్తపేట మండలం గంటి చినపేటకి చెందిన యడ్ల సుభాష్ (26) ఈ నెల 9న రావులపాలెం మండలం గోపాలపురం వద్ద హైవేపై లారీ ఢీకొని మృతిచెందాడు. తండ్రి లేని కుటుంబంలో తల్లి, తమ్ముడుకు సుభాష్ ఆధారం. సుభాష్ మృతితో వాళ్లిద్దరూ దిక్కులేని వారయ్యారు. ఇటీవల డీటీఓ శ్రీనివాసరావు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వారి దయనీయ పరిస్థితిని చూసి చలించిపోయారు. బుధవారం వారికి నిత్యావసరాలు తీసుకొచ్చి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ముళ్ల జనార్ధనరావు, చినపేట గ్రామ పెద్దలు మానుకొండ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు దాణా వితరణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలోని గోశాలకు బుధవారం పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లికి చెందిన దాత గుబ్బల రాజేష్, కరుణ దంపతులు 4 దాణా బస్తాలను వితరణ చేశారు. ఈ మేరకు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ సమక్షంలో దాణాను గోశాల సిబ్బందికి ఇచ్చారు. స్వామి వారి సేవా బృందం పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో బుధవారం కొబ్బరిలోడుతో ప్రయాణిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ బోల్తా కొట్టిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ స్వల్ప గాయలతో బయటపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి ట్రాక్టర్‌లో ఉన్న కొబ్బరికాయలను తీసి దానిని యథాస్థితికి తీసుకొచ్చారు.

రోషిణికి అవార్డు



రోషిణిని సన్మానిస్తున్న చైతన్య వేదిక ప్రతినిధులు

మామిడికుదురు: ఫార్మసీలో డాక్టరేట్ పొందిన పాశర్లపూడి బాడవకు చెందిన ఉప్పే వేణుగోపాల్, పద్మ దంపతుల కుమార్తె రోషిణికి రాష్ట్ర దళిత చైతన్య వేదిక అంబేడ్కర్ విద్యా కుసుమాలు అవార్డును బుధవారం ప్రదానం చేసింది. పాశర్లపూడిబాడవలో అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణంలో దళిత చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలకపాటి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రోషిణిని ఘనంగా సత్కరించారు. విద్యలో రాణిస్తున్న విద్యార్థులకు చైతన్య వేదిక ద్వారా ఈ అవార్డును ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ, రాష్ట్ర కో–ఆర్డినేటర్ చింతా శ్రీనివాస్, రాజోలు వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, వేదిక సభ్యులు మట్టా సురేష్ కుమార్, లిఖితపూడి బుజ్జి, మందపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

రేపు శాంతి హోమం

మలికిపురం: గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయం ప్రారంభించి 101 రోజులు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 1న ఆలయ ప్రాంగణంలో శాంతి హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బుధవారం తెలిపింది. గ్రామస్తులు, భక్తులందరూ పాల్గొనాలని కమిటీ కోరింది.

నిబంధనల మేరకే నిధులు

మలికిపురం: మండల ఎంపీడీఓ కార్యాలయంలో సఖినేటిపల్లి, మలికిపురం మండలాల పంచాయతీ కార్యదర్శులతో ఉచిత సోలార్ సౌకర్యంపై జరిగిన జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడారు. పంచాయతీ నిధులు ఏ పనికి ఎంత ఖర్చు చేయాలో నిబంధనల మేరకు పాటించాలన్నారు. కరెంట్ వినియోగం పెరగడంతో ఆ లోటును సోలార్‌తో భర్తీ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ సెట్‌లు ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ సమావేశంలో ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ప్రత్యేకాధికారి పి.కృష్ణమూర్తి, రాజోలు సాగునీటి సంస్థ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, ట్రాన్స్‌కో ఏడీఏ బి.వి కృష్ణరాజా, ఎంపీడీఓలు మల్లికార్జునరావు, సూర్య నారాయణ, తహసీల్దార్లు టి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ముప్పర్తి నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్యను పెంచాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో ఆయుష్మాన్ భారత్ సేవలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యాధికారి డి.సాయికిషోర్ అన్నారు. పీహెచ్‌సీలో బుధవారం వైద్యారోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం జరిగింది. జూలై నెలలో సాధించిన ప్రగతిని అధికారులకు ఆరోగ్య సిబ్బంది వివరించారు. అనంతరం సబ్‌సెంటర్ల వారీగా వైద్యాధికారులు రికార్డులను తనిఖీ చేసి వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా సుందర్



రాజోలు: రవాణా శాఖ విజయవాడ జోన్–2 జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా సోంపల్లికి చెందిన వడ్డి సుందర్ నియమితులయ్యారు. రవాణా శాఖ జాయింట్ కమిషనర్ అడ్మిన్ ఐటీ విభాగం నుంచి బదిలీ అయిన సుందర్ జోన్–2 సంయుక్త కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలకు సంబంధించి రవాణా శాఖ బాధ్యతలు నిర్వహిస్తారు. విజయవాడ జోన్–2 జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం పట్ల మండల ఉపాధ్యక్షుడు పొలమూరి శ్యామ్‌బాబు, సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వైభవంగా చండీ హోమం



పూర్ణాలంకరణలో అమ్మవారు

రావులపాలెం: స్థానిక కొత్త కాలనీలోని విజయదుర్గ అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారికి చండీ హోమం వైభవంగా నిర్వహించారు. దేవరబొట్ల భానుమూర్తి ఆధ్వర్యంలో చండీ హోమం, సరస్వతి హోమం నిర్వహించారు. అమ్మవారు పూర్ణాలంకరణలో దర్శనమిచ్చారు. రూరల్ సీఐ విద్యాసాగర్ అమ్మవారిని దర్శించుకున్నారు.

వైఎస్సార్ సీపీ వేగివారిపాలెం కార్యవర్గమిదే..



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

రాజోలు: వేగివారిపాలెం వైఎస్సార్ సీపీ గ్రామశాఖ కార్యవర్గం ఏకగ్రీవంగా బుధవారం ఎన్నికైంది. పార్టీ నాయకుడు సాయిబాబు అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో గ్రామశాఖ అధ్యక్షుడిగా బళ్ల లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శులుగా పాముల సాయిబాబు, అనుమారి త్రినాథరావు, మంగం శివ, కండిబోయిన భాస్కరరావు, కార్యదర్శులుగా కొల్లాబత్తుల జగన్మోహన్ లాల్, అరవ కనక సత్యనారాయణ, మామిడిశెట్టి వెంకటేశ్వర్లు, గోగి విజయ్ భాస్కరరావు ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్‌బాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.